సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 23 । మే । 2025



నంగునూరు: తిమ్మాయిపల్లిలో 72 అడుగుల హనుమాన్ విగ్రహం ఆవిష్కరణ

జై హనుమాన్..

- ఘనంగా జయంత్యుత్సవాలు
- రామనామస్మరణతో మార్మోగిన పట్టణాలు, గ్రామాలు

జిల్లాలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగాయి. ఉదయం నుంచే దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలలో హనుమాన్ మూలవిరాట్‌ను పూలతో, తమలపాకులతో, వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పలుచోట్ల నిర్వహించిన శోభాయాత్రలో మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. దీంతో పట్టణాలు, గ్రామాలు రామనామ స్మరణతో మార్మోగాయి. నంగునూరు మండలం తిమ్మాయిపల్లిలో 72 అడుగల విగ్రహాన్ని ఆవిష్కరించారు.

- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



జిల్లా కేంద్రంలోని పంచముఖ హనుమాన్ ఆలయంలో స్వామి వారు



మద్దూరు: హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న మాలధారులు, ప్రజలు



దుబ్బాక: హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు



రంగధాంపల్లిలో మాలవిరమణ చేస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

సిద్దిపేటరూరల్: దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యరెడ్డి జయంతి వేడుకల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1906–1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడన్నారు. అంతకు ముందు ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన విహాన్‌రామ్



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని హనుమతండాకు చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు జాటోత్ విహాన్‌రామ్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ అభినందించారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్, మెడల్‌ను బండి సంజయ్ నుంచి అందుకున్నారు. మారుమూల గిరిజన తండాకు చెందిన బాలుడు విహాన్‌రామ్ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం రాష్ట్రానికే గర్వకారణమని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అంతర్జాతీయ పర్వతాలను అధిరోహించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

వ్యవసాయ అధికారి రాధిక



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారి రాధిక, ఏఓ గీత

నంగునూరు(సిద్దిపేట): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక హెచ్చరించారు. నంగునూరులోని పలు ఎరువుల దుకాణాలను గురువారం ఏఈ గీతతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం రైతు ఆగ్రోసేవా కేంద్రంలో 50 శాతం రాయితీపై అందిస్తున్న జీలుగ, జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలు, రికార్డులు పరిశీలించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణ దారులను ఆదేశించారు. అనంతరం రాధిక మాట్లాడుతూ నేల భూసారాన్ని పెంపొందించేందుకు పచ్చిరొట్ట ఎరువులుగా ఉపయోగపడే జీలుగ, జనుము పంటను సాగు చేయాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఏసీపీగా రవీందర్ రెడ్డి గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాప్రతినిధులు, శాంతి భద్రతలకు సహకరించాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని అన్నారు.

హస్తంలో సంస్థాగతం

- బ్లాక్, మండల, పట్టణ కమిటీల నియామకాలకు కసరత్తు
- జిల్లా సమన్వయకర్తలుగా అల్లాడి పవన్, రోహిత్‌లు
- మండల స్థాయి సమావేశాల్లో నామినేషన్ల స్వీకరణ
- పదవులు దక్కించుకునేందుకు ఆశావహుల్లో పోటీ

పార్టీ పటిష్టతపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి



కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా గ్రామ, బ్లాక్, మండల, పట్టణ, జిల్లా పార్టీ పదవులను ఈ నెలాఖరులోపు భర్తీ చేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే జిల్లాకు సమన్వయకర్తలుగా అల్లాడి పవన్, రోహిత్‌లను టీపీసీసీ నియమించింది. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి ముఖ్య కార్యకర్తలు, నేతలతో సమావేశం నిర్వహించి పార్టీ పదవులకు ఏ విధంగా ఎన్నికలు నిర్వహించాలో సమన్వయకర్తలు వివరించారు.

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో నాలుగు నియోజకవర్గ కేంద్రాలున్నా ఒక్కరే కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే ఉన్నారు. మిగతా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉండటంతో పార్టీని పటిష్టపరిచేందుకు కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం కొనసాగుతున్న పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కేవలం కార్యాలయాలకే పరిమితం అయ్యారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి.. పార్టీ పటిష్టతకు కృషి చేసేవారిని పట్టణ అధ్యక్షులుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

నామినేషన్ల స్వీకరణ

నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సమావేశాలను నిర్వహించారు. ప్రస్తుతం మండల స్థాయిలో పార్టీ సమావేశాలు జరుగుతున్నాయి. మండల సమావేశాల్లోనే పార్టీ పదవులు ఆశించే వారి నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. సామాజిక సమీకరణలు, నాయకుల సమర్థత, సీనియారిటీ, నియోజకవర్గాలు, ఆయా బ్లాక్ బలోపేతానికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పదవుల పంపకాలుంటాయని పార్టీనేతలు పేర్కొంటున్నారు.

పదవుల కోసం పోటాపోటీ

జిల్లాలో 26 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటికి అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం పార్టీ హైకామండ్ నిబంధనలు విధించింది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తూనే మహిళలు, యువతకు పదవుల్లో పెద్దపీట వేయాలని టీపీసీసీ నిర్ణయించింది. ఇకపై పార్టీ కమిటీలే అన్ని నిర్ణయాల్లో కీలక పాత్ర వహిస్తాయనే సంకేతాలతో వీటిని దక్కించుకునేందుకు నాయకుల ప్రయత్నాలు ప్రారంభించారు. సుదీర్ఘ విరామం అనంతరం ఆయా పదవులకు ఎన్నికలు జరగనుండటం.. పార్టీ అధికారంలో ఉండటంతో నేతలు వాటిని దక్కించుకొనేందుకు పోటీ పడుతున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో నేతల మధ్య పోటీ నెలకొననుంది. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జ్ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యేలను కలిసి అవకాశం ఇవ్వాలని ఆశావహులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, చిత్రంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తదితరులు

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- అధికారులతో సమీక్ష
- అమలు ప్రక్రియ వేగిరం చేయాలని ఆదేశాలు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు క్షేత్ర పరిశీలనపూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై జిల్లా, మండల అధికారులతో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను మార్గదర్శకాలు ప్రకారం పరిశీలన పూర్తిచేయాలన్నారు. పైలెట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ దశలను ఇంజనీర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇళ్లు మంజూరైనా నిర్మాణం చేపట్టని వారితో మాట్లాడాలన్నారు. వారికి అవసరం లేకపోతే పేరు తొలగించి వేరే లబ్ధిదారునికి ఇవ్వాలన్నారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రమేష్, బీసీ వెల్ఫేర్ అధికారి నాగరాజమ్మ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, పీడీ హౌసింగ్ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పాలన పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో జరగనున్న గ్రామ పాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తంగా 142 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఏఐతో విద్యాబోధన చేయాలి

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి
- ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల పరిశీలన



గుడికందులలో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ఏఐ టెక్నాలజీతో విద్యాబోధన చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గుడికందుల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అలాగే ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు రెండు జతల యూనిఫాం అందిస్తోందన్నారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవద్దని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సయ్య, హెచ్‌ఎం అంజిరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

కొండపాక(గజ్వేల్): ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లిలో శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధనలు జరిగేలా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. బోధనలో ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటూ బోధించాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, డీఆర్పీ శ్రీనివాస్‌రెడ్డి, రిసోర్సు పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీలుగ కోసం రోడ్డెక్కిన రైతులు



రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

తొగుట(దుబ్బాక): జీలుగ విత్తనాల కోసం రైతులు రోడ్డెక్కారు. మండలానికి సరిపడా జీలుగ విత్తనాలు సరఫరా చేయడం లేదంటూ గురువారం స్థానిక రైతు వేదిక వద్ద గజ్వేల్–సిద్దిపేట రహదారిపై గంటసేపు రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తంచేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే మండలానికి కేవలం 140 బస్తాలే వచ్చాయన్నారు. ఈ క్రమంలో ఏఓ మోహన్ రైతులను సముదాయించే ప్రయత్నంచేసినా వినిపించుకోలేదు. రోహిణి కార్తె వచ్చినా విత్తనాలు అందుబాటులో ఉంచకుండా అధికారులు ఏమి చేస్తున్నారంటూ మండిపడ్డారు. రైతులు ఆందోళనకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతోనే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. క్రమంలో రెండు రోజుల్లో సరిపడా జీలుగ విత్తులు తెప్పిస్తామంటూ ఏఓ రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించగా జీలుగ విత్తనాల కోసం ముందస్తుగా టోకెన్లు అందించారు.

అందరి సహకారంతో డిపో అభివృద్ధి: ఈడీ సాల్మన్

హుస్నాబాద్: ఉద్యోగులు సమన్వయం చేసుకుంటూ డిపో అభివృద్ధికి కృషి చేయాలని కరీంనగర్ రీజియన్ ఈడీ సాల్మన్ పిలుపునిచ్చారు. ఆయన హుస్నాబాద్ ఆర్టీసీ డిపోను గురువారం సందర్శించారు. ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రమాదాలకు తావివ్వకుండా విధులు నిర్వహించాలని కోరారు. టీమ్–20 అనే కార్యక్రమం ద్వారా డిపోలోని ముఖ్య కేటగిరీ నుంచి 20 మందిని సెలక్ట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ రీజనల్ మేనేజర్ రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్ వెంకన్న, ట్రాఫిక్ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోళ్లు చేయండి

- లేదంటే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం
- ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం రెండ్రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేయకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం గజ్వేల్‌లోని కొనుగోలు కేంద్రాలు, రింగురోడ్డుపై తడిసిన వడ్లను బైక్‌లపై వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా నిర్మాణమైన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల వరి ధాన్యం ఉత్పత్తులు భారీగా పెరిగాయని గుర్తు చేశారు. నేడు ఆ ఉత్పత్తులను కొనుగోలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలు, రోడ్ల వెంట వేలాది క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు దినదిన గండంగా గడుపుతున్నారని వాపోయారు. కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీఆర్‌ఎస్ గజ్వేల్ పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బిల్లు రాక.. గూడు లేక

- ఇందిరమ్మ లబ్ధిదారు అరిగోస
- అప్పు చేసి బేస్మెంట్ వరకు నిర్మాణం
- అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితురాలు



అక్కన్నపేట(హుస్నాబాద్): పై చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు పొన్నాల పద్మ. మండల పరిధిలోని కుందనవానిపల్లి గ్రామం. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఉన్న ఇంటిని కూలగొట్టి అదే స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. దాదాపు రూ.2 లక్షల వరకు అప్పు చేసి బేస్మెంట్ వరకు నిర్మించారు. నిబంధనల ప్రకారం బేస్మెంట్ వరకు పనులు పూర్తికాగానే బిల్లు రూ.లక్ష రావాల్సి ఉంది. కానీ ఈమెకు రెండు నెలలైనా బిల్లు రాలేదు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శి సుచరిత ఇల్లు నిర్మాణ ఫొటో క్యాప్చర్ చేసినప్పుడల్లా 'గోయింగ్ టు నియరెస్ట్ లొకేషన్' అంటూ ఎర్రర్ వస్తోందని అధికారులు చెబుతున్నారు. బిల్లు రాక ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఎంపీడీఓ భానోతు జయరాంతో పాటు ఇటీవల కలెక్టర్‌ను కూడా కలిసినా సమస్య పరిష్కారం కాలేదు. చేసేదిలేక తాత్కాలికంగా వేసుకున్న రేకుల షెడ్డులో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. తనను కలిసిన సాక్షితో గోస చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. అధికారులు సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

151 ఇళ్లు మంజూరు

అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైంది. గ్రామంలో ఇళ్లు లేని 151మంది నిరుపేదలకు మంజూరు పత్రాలను అందజేశారు. 61మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. అందులో 42 మంది బేస్మెంట్ లెవల్ వరకు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం 36మంది ఇందిరమ్మ లబ్ధిదారులకు మొదటి దఫా కింద రూ.లక్ష చొప్పున బిల్లు చెల్లించారు. కొన్ని టెక్నికల్ కారణాలతో కొందరికి డబ్బులు రాలేదు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి లబ్ధిదారులకు బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై సాక్షి ఎంపీడీఓ భానోతు జయరాంను సంప్రదించగా ఇందిరమ్మ లబ్ధిదారురాలైన పద్మకు లోకేషన్ ఎర్రర్ రావడంతో బిల్లు రావడం లేదు. అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అలాగే కొందరికి టెక్నికల్ కారణాలతో బిల్లులు రావట్లేదని తెలిపారు.



తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న రేకుల ఇల్లు

క్లుప్తంగా

పాఠశాలలకు నోటీసులు



నోటీసు అంటిస్తున్న సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, విద్యా శాఖ నిబంధనలు పాటించకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు మండల విద్యా శాఖ అధికారి రచ్చ కిష్టయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలతోపాటు ఇంటర్నేషనల్, సీబీఎస్సీ అనుమతి లేకుండానే ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్న ఓక్లే పాఠశాలకు నోటీసులు జారీ చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో తెలుసుకొని పిల్లలను చేర్పించాలని సూచించారు.

పాఠశాల దశనే విద్యార్థి జీవితంలో కీలకం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



సూచనలు చేస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

దౌల్తాబాద్ (దుబ్బాక): విద్యార్థి జీవితంలో పాఠశాల దశనే అత్యంత కీలకమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాయపోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజులు వృత్యంతర ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొనడం సంతోషకరమని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయపోల్ మండల విద్యాధికారి సత్య నారాయణ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామం వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన శారద ప్లాస్టిక్ వస్తువుల విక్రయం వ్యాపారం చేస్తోంది. 20న వ్యాపారం కోసం కూతురితో కలిసి బయటికి వెళ్లింది. మరుసటి రోజు సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.5 వేల నగదు చోరీ గురైనట్లు గుర్తించారు. గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసిన ఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. గురువారం గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో గల లక్ష్మీప్రసన్న కాలనీలోని ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 29,800 నగదుతోపాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేసవి శిబిరం.. విజ్ఞాన నైపుణ్యం

- పేద విద్యార్థులకు అండగా తెల్లాపూర్ నైబర్ హుడ్
- ఐదేళ్లుగా ఉచితంగా నిర్వహణ
- ఉత్సాహం చూపుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- దాతలు సైతం సహకారం

తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ కావత్ విభాగం పేద విద్యార్థులకు అండగా నిలుస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఐదేళ్లుగా వేసవిలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తూ వారిలో నైపుణ్యాన్ని మరింత పెంచుతున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో నెల రోజులుగా కొనసాగుతున్న వేసవి శిబిరంపై ప్రత్యేక కథనం..

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ అసోసియేషన్ ద్వారా వారి సమస్యలను పరిష్కరించుకుంటూ సామాజిక సేవలో ముందుంటున్నారు. 2020 నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవిలో పలు అంశాలపై ఉచితంగా శిక్షణను అందిస్తున్నారు. మొదట 40 మంది విద్యార్థులతో మొదలైన శిబిరంలో ప్రస్తుతం 100 మంది పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు.



యోగా శిక్షణలో విద్యార్థులు

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంచేందుకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు, గణితశాస్త్రం, యోగా, నృత్యం, వ్యక్తిగత వికాసం, స్వయం రక్షణ, వంటలపై శిక్షణ అందిస్తున్నారు.

స్వచ్ఛందంగా వస్తున్న వలంటీర్లు

వేసవి శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు శిక్షణ అందించేందుకు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ముందుకొస్తున్నారు. వారితోపాటు స్థానిక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు సహకారం అందిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, టీషర్ట్‌లను అందిస్తున్నారు. వారిని ఇంటి నుంచి తీసుకురావడానికి బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.



గణితం, ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నా..



వేసవి శిబిరంలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల్లో పాల్గొంటున్నాను. ఎంతో సులభంగా ఇంగ్లిష్ మాట్లాడే విధానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీని వల్ల ఇంగ్లిష్‌పై మరింత పట్టు సాధిస్తున్నాను. ప్రతి రోజూ శిక్షణకు హాజరవుతున్నాను.

– భాగ్యలక్ష్మి, 7వ తరగతి

అర్థమయ్యేలా బోధన



తెల్లాపూర్ నైబర్ హుడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం మాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో గణితశాస్త్రం, ఇంగ్లిష్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఏదైనా సందేహం వచ్చి అడిగిన వెంటనే మాకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు.

– జస్వంత్, జిల్లా పరిషత్ విద్యార్థి

మంచి స్పందన ఉంది



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రతీ సంవత్సరం ఉచితం వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాం. నైబర్ హుడ్ కవాత్ పేరిట పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం. నైబర్ హుడ్ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– కవిత, నైబర్ హుడ్ కవాత్ కన్వీనర్

దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు



వేసవి శిబిరాలకు సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు. శిబిరంలో శిక్షణ కోసం విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషం. దాతలు కూడా ముందుకొచ్చి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎడ్యుకేషన్ హబ్‌గా నర్సాపూర్

ఓయూ వైస్ చాన్స్‌లర్ కుమార్ మొగులారం



మాట్లాడుతున్న మొగులారం, పక్కన ఓయూ అధికారులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని తమ పీజీ కాలేజీని అభివృద్ధి చేసి నర్సాపూర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొగులారం తెలిపారు. గురువారం నర్సాపూర్‌లోని ఓయూ పీజీ కాలేజీని సందర్శించి కాలేజీ భవనం, ల్యాబోరేటరీలు, తరగతి గదులు పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆయా జిల్లాల్లో ఉన్న ఓయూ పీజీ కాలేజీలను పలువురు అధికారులతో సందర్శించి సదుపాయాలు, సమస్యలు తెలుసుకుంటున్నామని అందులో భాగంగా స్థానిక కాలేజీకి వచ్చినట్లు తెలిపారు. నర్సాపూర్ ఓయూ పీజీ కాలేజీకి ప్రభుత్వం 10 ఎకరాల భూమి కేటాయించిందని, మరో 10 ఎకరాలు కేటాయించేందుకు తాము సంబంధిత అధికారులతో ప్రయత్నాలు చేయనున్నట్లు చెప్పారు. కాలేజీకి సొంత భవనం లేక నిర్వహణ ఇబ్బందిగా ఉన్నట్లు తాను గుర్తించానన్నారు. భవనం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్, జిల్లా పీజీ కాలేజీల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, జిల్లా పీజీ కాలేజీల రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, ఓయూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌రావు ఉన్నారు. కాగా కాలేజీలో కొనసాగుతున్న కోర్సులు, వసతులను స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డి, కాలేజీ ప్రొఫెసర్లు వైస్ చాన్స్‌లర్ బృందానికి వివరించారు.

భాషా లక్ష్యాల సాధనకు శిక్షణ ఉపయుక్తం

రాష్ట్ర తెలుగు పరిశీలకులు భాను ప్రకాశ్



మాట్లాడుతున్న అవుసుల భాను ప్రకాశ్

మెదక్ కలెక్టరేట్: భాషా లక్ష్యాల సాధనకు, విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాలను పెంచేందుకు వృత్యంతర శిక్షణ ఎంతో ఉపయుక్తమని రాష్ట్ర తెలుగు పరిశీలకులు అవుసుల భాను ప్రకాశ్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో జరుగుతున్న తెలుగు ఉపాధ్యాయుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి గురువారం పరిశీలకులుగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా బోధనలో జరుగుతున్న మార్పులను స్వీకరించాలన్నారు. అంతేకాకుండా భాషా బోధనలో తెలుగు ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని, అందుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన బోధన చేయాలని సూచించారు. విద్యార్థులలో సృజన పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ ఇన్‌చార్జి సుదర్శన మూర్తి, రిసోర్స్ పర్సన్‌లు చిన్న బక్కప్ప, జనార్దన్, సుమన్, సాయిరాం శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో పాడి ఆవులు మృత్యువాత

చేర్యాల(సిద్దిపేట): పాముకాటుతో రెండు పాడి ఆవులు మృతి చెందిన ఘటన మండలంలోని ఆకునూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సోంరెడ్డి యశ్వంత్ రెడ్డి అనే రైతు బుధవారం వ్యవసాయ బావి వద్ద ఆవులను కట్టేసి ఇంటికొచ్చాడు. గురువారం ఉదయం చూసేసరికి రెండు ఆవులు మృతి చెంది ఉన్నాయి. పరిసరాల్లో గమనిస్తే పాములు కనిపించినట్లు తెలిపారు. దీంతో పాముకాటుకు గురైనట్లు భావించారు. మృతి చెందిన ఒక్కో ఆవు విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు స్పందించి బాధిత రైతుకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖాతా నుంచి డబ్బులు కట్

హత్నూర (సంగారెడ్డి): పీఎం కిసాన్ యాప్ ద్వారా బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు పోయినట్లు ఓ బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎరుకల యాదగిరి బ్యాంకు ఖాతా ఉంచి 18న రూ.34 వేలు కట్ అయ్యాయి. తన ఖాతా ఉన్న దౌల్తాబాద్‌లోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లి అడుగగా పీఎం కిసాన్ యాప్ ద్వారా కట్ అయ్యాయని బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. సైబర్ నేరగాళ్లే ఈ పని చేయొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఓటీపీలు గానీ ఇతర యాప్‌ల ద్వారా లింకులు వస్తే షేర్ చేయొద్దని ఎస్ఐ శ్రీధర్ సూచించారు.





చందాపూర్ గ్రామంలో గోడలపై రాసిన అక్షరాలను చదువుతున్న పిల్లలు

గోడలపై అక్షరాలు.. మర్చిపోవద్దు పిల్లలు

- చందాపూర్ గ్రామంలో వాల్ రైటింగ్స్
- విద్యార్థులు చదివింది వేసవిలో మర్చిపోవద్దని ఓ ప్రధానోపాధ్యాయుడి వినూత్న ఆలోచన



పరమేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం

చిన్నశంకరంపేట(మెదక్): వేసవిలో ఆట విడుపుతో విద్యార్థులు చదివిందంతా మర్చిపోతుంటారు.. అలా చదివిన చదువును మర్చిపోవద్దని వినూత్నంగా ఆలోచించాడు చందాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి. తాను చదువు చెప్పే చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామంలోని పలు గోడలపై తెలుగు, ఆంగ్లం అక్షరాలు, వర్ణమాల, అంకెలు, ఎక్కాలు, గణితం వంటి వాటిని రాయించాడు. గ్రామంలో చిన్నారులు ఆడుకునే చోట, కిరాణ దుకాణాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద రాయడంతో విద్యార్థులు సైతం గోడలపై రాతలను ఆసక్తిగా చదవడం కనిపించింది. పెద్దలు సైతం చిన్నారులతో చదివిస్తున్నారు. వేసవిలో ఆటలపై దృష్టి పెట్టే పిల్లలు చాలా వరకు అక్షరాభ్యాసనం (బేసిక్స్) మర్చిపోతుంటారు. పాఠశాల తిరిగి ప్రారంభించాక ఒక నెలంత రివిజన్స్‌కు పోతుంది. ఇలా కావొద్దని గోడలపై రాయించినట్లు చెప్పుకొచ్చారు.

కొండపోచమ్మ వద్ద ఉబ్జెకిస్తాన్ అధికారులు



సాగర్ వద్ద ఫొటో దిగుతున్న ఉబ్జెకిస్తాన్ అధికారులు

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండల కేంద్రంలో గల కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టును గురువారం ఉబ్జెకిస్తాన్ ఉన్నతాధికారుల బృందం సందర్శించారు. కొండపోచమ్మ నిర్మాణం, నీటి సామర్థ్యం, ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియ గురించి సమగ్రంగా కార్య నిర్వాహక ఇంజనీర్ రఘునాథ్ ప్రసాద్ అధికారుల బృందానికి వివరించారు. నిర్మాణంలో వినియోగించిన ఆధునిక సాంకేతికత, పనుల అమలు విధానం, ఎదురైన విధానాల గురించి ఉబ్జెకిస్తాన్ ఉన్నతాధికారులకు స్పష్టంగా వివరించారు. రిజర్వాయర్ నిర్మాణ లక్షణాలు, భూసేకరణ, భూగర్భజలాలు పెంపకం, ప్రాంతీయ ప్రయోజనాలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే పంపింగ్, కట్టపై అధికారుల బృందం ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. ఈ సందర్శన భారతదేశ సాగునీటి రంగంలో జరిగిన పురోగతిని గ్లోబల్ స్థాయిలో ప్రదర్శించే మంచి అవకాశంగా నిలిచిందని ఉబ్జెకిస్తాన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ మోతియా, ఏఈఈ ప్రశాంత్, సాయి కుమార్‌రెడ్డి, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సందర్శన

ములుగు(గజ్వేల్): మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీని గురువారం ఉజ్బెకిస్తాన్ దేశానికి చెందిన ఉన్నతాధికారుల బృందం సందర్శించారు. డాక్టర్.రేష్మీనాయర్ ఆధ్వర్యంలో పర్యటించిన అధికారుల బృందం ముందుగా కాలనీలో నిర్మాణమైన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడి ప్యాకేజీలు విషయమై అడుగగా తహసీల్దార్ ఆరీఫా బృందానికి వివరించారు. అదే విధంగా కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలను, సమీపంలో నిర్మాణమైన పరిశ్రమలను పరిశీలించారు.

శుభకార్యానికి వెళ్లొస్తుండగా యువకుడు మృతి

- మరో యువకుడికి గాయాలు
- డీసీఎంను ఢీకొని బైక్ బోల్తా



మహేశ్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వడియారం గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన పిట్ల మహేశ్(21), కాగుల మధు మాసాయిపేటలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి బైక్‌పై చేగుంట వైపునకు వస్తున్నారు. వడియారం శివారులోకి రాగానే బైక్ ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ డీసీఎంను ఢీకొని యువకులు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, మధుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గల దుకాణాల్లో భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరైనా గుర్తిస్తే 87126 56718 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

జహీరాబాద్‌లో మరో వ్యక్తి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీ రూమ్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కష్టం నేల పాలు



బోల్తా పడిన లారీ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్, మంగళపర్తి గ్రామాల మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న మలుపు వద్ద గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. మంగళపర్తి ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి వెల్దుర్తి వైపు వడ్ల లోడ్‌తో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న వడ్ల సంచులు నేలపై పడిపోయాయి. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

దిగబడిన ధాన్యం లారీ

సిద్దిపేటఅర్బన్: బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి మిట్టపల్లిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం లారీ బురదలో దిగబడింది. గురువారం పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ చొరవతో క్రేన్ సాయంతో లారీని బయటకు లాగారు.

ఇటుక బట్టీల్లో తనిఖీలు

- గర్భిణీతో పని చేయిస్తున్నట్లు ఫిర్యాదు
- 18 మందిని గుర్తించి స్వస్థలాలకు పంపిన అధికారులు

గజ్వేల్‌రూరల్: ఇటుక బట్టీల్లో గర్భిణీతో పని చేయిస్తున్నట్లు తెలుసుకున్న అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. అధికారుల కథనం మేరకు.. మర్కూక్ మండలం పాతూరు సమీపంలోని ఓ ఇటుక బట్టీలో ఒరిస్సాకు చెందిన కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో గర్భిణీతో పనులు చేయిస్తుండగా తమకు విముక్తి కల్పించాలని కార్మికులు తెలంగాణ సీఎం కార్యాలయం, ఒరిస్సా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గజ్వేల్ సీఐ సైదా, లేబర్ అధికారి జ్యోతి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాము, సిబ్బంది రాజు, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ఇటుక బట్టీల వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 4 కుటుంబాలకు చెందిన 18 మందితో మాట్లాడి వారిని సిద్దిపేటలోని 'నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం'కు తరలించారు. అనంతరం వారిని స్వస్థలాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

గజ్వేల్‌రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ ఎదుట హాజరు పర్చగా విచారణ అనంతరం ఐదుగురికి రూ.6,500 జరిమానాతోపాటు ఇందులో ఓ వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

బావిలో పసికందు మృతదేహం

అప్పనపల్లిలో దారుణం

- తల్లి ఒడిలోంచి దుండుగులు కిడ్నాప్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- కన్న తల్లిపైనే అనుమానం?



రెండు నెలల పసికందు

దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలో దారుణం జరిగింది. రెండు నెలల పసికందును తల్లి ఒడిలోంచి దుండగులు అపహరించారంటూ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేయడం.. మృతదేహం గురువారం సాయంత్రం బావిలో లభ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ దారుణ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరుకు చెందిన రామగల్ల శ్రీమాన్, నంగునూరు మండలం నర్మెట్టకు చెందిన కవిత మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి రెండు నెలల క్రితమే కొడుకు పుట్టాడు. ఈక్రమంలో కొన్ని రోజులుగా వీరు అప్పనపల్లిలో శ్రీమాన్ అమ్మమ్మ గ్యార ఎల్లవ్వ ఇంట్లో నివాసం ఉంటున్నారు. డెకరేషన్ పనులు చేస్తున్న శ్రీమాన్ ఈ నెల 17న పని నిమిత్తం తన అక్క ఊరు రుద్రారం వెళ్లాడు. ఈక్రమంలో సాయంత్రం వేళ ఇంటి ఆరుబయట తన కొడుకును ఎత్తుకొని నిలబడిన కవిత వద్దకు ముసుగు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెతో మాటలు కలిపారు. 'మీరు శ్రీమాన్ భార్యనా అని, మీరు మాకు తెలుసు' అంటూ ఆమె ఒడిలోంచి 2 నెలల పసికందును బలవంతంగా లాక్కొని బైక్‌పై పరారయ్యారు. దీంతో ఒక్కసారిగా నిశ్చేష్టురాలైన కవిత గట్టిగా కేకలు పెట్టింది. ఈ విషయం భర్తకు వెంటనే సమాచారం అందించింది. దీంతో బుధవారం రాత్రి భర్త శ్రీమాన్‌తో కలిసి దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.



పసికందు మృతదేహంతో రోదిస్తున్న బంధువులు



బావిలోంచి క్రేన్ సాయంతో మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు, ఫైర్‌సిబ్బంది

తల్లి సమాచారంతోనే వెలికితీత..

పసికందును బావిలో పడేసి హత్యచేసిన ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. బుధవారం రాత్రి తన కొడుకును దుండగులు అపహరించారంటూ ఫిర్యాదు చేయడం.. ఆ క్రమంలోనే తల్లి కవితను పోలీసులు ప్రత్యేకంగా విచారించడంతో విస్తుగొలిపే నిజాలు బయటకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. విచారణలో ఆమె ఇచ్చిన సమాచారం మేరకే దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఫైర్ సిబ్బంది గురువారం అప్పనపల్లిలోని పెద్ద బావిలో 4 గంటలకు పైగా గాలించి ఎట్టకేలకు ఆ పసికందు మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిసింది. కవితనే ఈ దారుణంకు పాల్పడిందా? లేదా ఎవరైనా ఉన్నారా? అనే విషయంపై విచారిస్తున్నట్లు తెలిసింది.